సాక్షి
కాకినాడ

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గరికపాటి నమశ్శివాయ (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

SPL SAKSHI PREMIER LEAGUE

ధనాధన్ విన్నర్స్ ఐడియల్, శ్రీప్రకాష్

ఆటల్లో గెలుపు ఓటముల కన్నా క్రీడాస్ఫూర్తి ప్ర.దానం అని, అది అలవర్చుకుని నిజ జీవితంలో కూడా రాణించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు. 10లో..

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.40 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

క్షయ బాధితులకు రూ.48 లక్షల కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

పిఠాపురం: ప్రధాన మంత్రి **టీబీ ముక్త భారత్** అభియాన్ కింద జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు రూ.48 లక్షల విలువైన పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం పౌష్టికాహార కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో 9 టీబీ యూనిట్లు ఉన్నాయని చెప్పారు. టీబీకి చికిత్స పొందుతున్న వారికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రిలయన్స్, ఓఎన్‌జీసీ, అపోలో సీఎస్ఆర్ నిధులతో పాటు రెడ్‌క్రాస్ సహాయంతో ఆరు నెలల కాలానికి సరిపడా పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. తొలి దశలో మూడు నెలలకుగాను పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 40 మందికి రూ.700 విలువైన పౌష్టికాహార కిట్లను రెడ్‌క్రాస్ ద్వారా అందజేస్తున్నామని చెప్పారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా 1,145 మంది టీబీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా పిఠాపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మహిళలతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పీబీ విష్ణువర్ధిని, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోమినా పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక మహాసభలు



ఉమర్ ఆలీషా

పిఠాపురం: శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం వార్షిక మహాసభలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు. పీఠం ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1472లో స్థాపించిన తమ పీఠం 551 సంవత్సరాలుగా దేశ సమగ్రత, విశ్వ మానవ శాంతికి పాటు పడుతోందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 104 ఆశ్రమ శాఖల ద్వారా మహామంత్ర, జ్ఞాన, ధ్యాన ప్రక్రియలతో కూడిన త్రయీ సాధన ద్వారా ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రబోధిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించే మహాసభల్లో పీఠం ఆశయాలను ప్రతిబింబించే విధంగా 27 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు ఉంటాయని ఉమర్ ఆలీషా వివరించారు. విలేకర్ల సమావేశంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు పాల్గొన్నారు.

ముద్ర భద్రమేనా!

- జిల్లాలో సరికొత్త తరహా నేరాలు
- వేలిముద్రలు దొంగిలిస్తున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

నగలు, నగదే కాదు.. వేలిముద్రల్ని సైతం దొంగిలిస్తున్న కేటుగాళ్లు పుట్టుకొచ్చారు. కాకినాడ నగర పరిధిలో ఈ నేరాలు అధికంగా జరుగుతుండడం ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా చోటు చేసుకున్న ఈ నేరాలపై సమగ్ర కథనం.

– కాకినాడ క్రైం

- జగన్నాథపురానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ దయావతి కొద్ది రోజుల క్రితం గాంధీనగర్‌లోని ఓ ఆధార్ సెంటర్‌లో పాన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లింది. ఆధార్ కార్డు డౌన్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, అందుకు వేలిముద్రలు కావాలని సెంటర్ నిర్వాహకుడు నమ్మబలికాడు. పాన్‌కార్డుకు దరఖాస్తు చేశాడు. సరిగ్గా నెల రోజుల తరువాత ఆమె ఖాతా నుంచి రూ.70 వేల సొత్తు మాయమైంది. బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను పరిశీలిస్తే ఆధార్ సెంటర్ అడ్రస్ చూపింది. దీంతో నెల రోజుల క్రితం గాంధీనగర్ ఆధార్ కేంద్రంలో వేలిముద్రలు ఇచ్చిన విషయం దయావతికి గుర్తొచ్చింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. సదరు ఆధార్ కేంద్రం యజమానే దయావతి వేలిముద్రలు ఉపయోగించి ఆమె బ్యాంకు ఖాతాను ఖాళీ చేసినట్లు నిర్ధారించారు.
- విశాఖపట్నం నుంచి బతుకుతెరువు కోసం కాకినాడ వచ్చిన ఓ ల్యాబ్ టెక్నీషియన్‌కూ చేదు అనుభవం ఎదురైంది. ఆధార్‌లోని స్థానిక చిరునామా మార్పు కోసం ఈ–కేవైసీ కేంద్రాన్ని ఆశ్రయించగా వేలిముద్రలు చోరీ చేసి, తర్వాతి రోజే అతడి ఖాతా నుంచి పదంటే పది నిమిషాల వ్యవధిలో నాలుగు దఫాలుగా రూ.10 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు మాయం చేశారు. తొలి రూ.10 వేలు డ్రా అయిన తర్వాతే అప్రమత్తమై, నగదు డ్రా చేద్దామన్నా, ఖాతా బ్లాక్ చేద్దామన్నా కనీసం ఆ వ్యవధి కూడా లేకుండా పోయిందనీ, కళ్లముందే ఖాతా నుంచి డబ్బు ఖాళీ అవుతున్నా ఏమీ చేయలేకపోయానని ఆవేదన చెందాడు.
- రెండు వారాల క్రితం కాకినాడ రూరల్ ఇంద్రపాలేనికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికీ ఇదే స్థితి ఎదురైంది. వేలిముద్ర వల్ల ఖాతాలో రూ.38 వేలు మాయమైనట్టు కెనరా బ్యాంకు అధికారులు నిర్ధారించినా అది ఎక్కడి నుంచి జరిగిందో నేటికీ తెలియరాలేదు.

కాకినాడలో వేలిముద్రలతో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన నేరాల వివరాలు

సంవత్సరం	కేసులు
2019	72
2020	116
2021	98
2022	131

ఇక్కడ.. ఇలా..

ఈ తరహా నేరాలకి ఆధార్ కేంద్రాలు, మీసేవ, సిమ్ రిజిస్ట్రేషన్ కేంద్రాలు, నెట్ సెంటర్లు ఇతర ఈ–కేవైసీ కేంద్రాలు పెట్టని కోటల్లా మారాయి. ఆయా సంస్థల నిర్వాహకుల్లో కొందరు దురుద్దేశంతో తమ కేంద్రానికి వస్తున్న కస్టమర్లను నట్టేట ముంచుతున్నారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు, డౌన్‌లోడ్‌ల పేరుతో వేలిముద్రలు సేకరిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా భద్రపరిచి ప్రత్యేక వెబ్ పోర్టల్‌ల సాయంతో సమయం చూసుకొని కస్టమర్ల బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.



కాకినాడలోని ఓ నెట్ సెంటర్‌లో సింగిల్ డివైస్ స్కానర్ ద్వారా వేలిముద్రల స్కానింగ్

అర్ధరాత్రి వేళల్లోనే..

అర్ధరాత్రి వేళల్లోనే సైబర్ కేటుగాళ్లు ఈ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసుల పరిశీలనలో తేలింది. ఖాతాదారులు ఆ సమయంలో నిద్రలో ఉండటం, ఖాతా ఖాళీ అవుతున్నా మెసేజ్‌లు, ఇతర అలెర్టుల రూపంలో వచ్చే బ్యాంకు సమాచారాన్ని గుర్తించేందుకు తక్కువ ఆస్కారం ఉండటం నేరస్తులకు కలిసొచ్చే అంశాలు.

సిలికాన్ క్లోనింగ్ టెక్నాలజీతో..

వేలిముద్రలు దొంగిలిస్తున్న నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నట్టు పోలీస్ శాఖలోని ఐటీ నిపుణులు వెల్లడించారు. వేలిముద్రలను కాపీ చేసే క్రమంలో సిలికాన్ క్లోనింగ్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు గుర్తించారు.

దీని ద్వారా వేలిముద్రలు వేసిన పరికరంపై వాటిని తుడవనంత వరకూ తిరిగి సేకరించే, భద్రపరిచే, రూపొందించే అవకాశం ఉందని చెబుతున్నారు.

సింగిల్ ఫింగర్ స్కానర్లతో..

సింగిల్ ఫింగర్ స్కానర్లతో ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్నారు. వీటి ద్వారా ముఖ్యంగా బొటన వేలిముద్రలు స్కాన్ చేసేందుకు అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నెట్ సెంటర్లు, ఈ–కేవైసీ కేంద్రాల్లోనే ఈ తరహా నేరాలకు అవకాశం ఉంటుందని పోలీసులు అంటున్నారు. వేలిముద్రలు వేసిన తర్వాత తక్షణమే తుడిచేసి, స్కానర్లతో అనుసంధానమై ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను ఓసారి పరిశీలించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- సైబర్ నేరగాళ్ల చెరకు చిక్కకుండా ప్రతి ఒక్కరూ పలు జాగ్రత్తలు పాటించాలి.
- ఈ–కేవైసీ కేంద్రాలు, వేలిముద్రలు వేసే ఇతర కేంద్రాల వద్ద తప్పనిసరి అయితేనే వేలిముద్రలు వేయాలి.
- బయోమెట్రిక్ హాజరు వేసే కార్యాలయాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి.
- ఎక్కువ సొత్తు నిర్వహించే ఖాతాలు జాయింట్‌వైతే సురక్షితం.
- ఆధార్, నెట్, ఈ–కేవైసీ, సిమ్ కార్డు రిజిస్ట్రేషన్ కేంద్రాల్లో వేలిముద్రలు సహా ఇతర వివరాలు ఏవి ఇచ్చినా మన పని పూర్తయ్యాక దగ్గరుండి హిస్టరీ డిలీట్ చేయించాలి.
- ఆధార్ కార్డు నంబర్లు ఎక్కడ పడితే అక్కడ చెప్పకూడదు.
- నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ఖాతాతో పాటు బ్యాంకు ఖాతాకు అనుసంధానమయ్యే ఇతర సురక్షిత విధానాలను తప్పక యాక్టివేట్ చేసుకోవాలి. తద్వారా ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే అప్పటికప్పుడు నిలువరించే వెసులుబాటు ఉంటుంది.



ఆర్‌వీ నరసింహారావు, ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

నేరాలూ కొత్త పుంతలు



సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందుతుంటే అంతగా అప్రమత్తం కావాల్సి ఉంటుంది. మంచితో పాటు చెడూ అంతే స్థాయిలో వృద్ధి చెందుతోంది. వేలిముద్రల చౌర్యం అందులో ఒకటి. అధునాతన టెక్నాలజీ వినియోగిస్తూ కొంతమంది నేరాల బాట పడుతున్నారు. ప్రధానంగా అర్బన్ ప్రాంతాల్లో ఈ తరహా నేరాలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. జన సాంద్రత ఆధారంగా సాంకేతికత వినియోగం కూడా ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. సైబర్ క్రైం వింగ్‌లోని ప్రత్యేక విభాగం ఈ తరహా కొత్త నేరాలను ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ అందుకు తగ్గ అడుగులు వేస్తోంది. వేలిముద్రల వల్ల డబ్బు పోగొట్టుకున్న వారు, డేటా చోరీకి గురైన వారు తక్షణమే పోలీసుల్ని సంప్రదించాలి.

– ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ, కాకినాడ జిల్లా

పథకాలు ఆపే దమ్ముందా?

- చంద్రబాబుకు మంత్రి దాడిశెట్టి రాజా సవాల్
- కోటనందూరులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆపేస్తానని ప్రకటించే దమ్ముందా అని చంద్రబాబుకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సవాల్ విసిరారు. కోటనందూరులో మంగళవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేవలం రూ.100 కోట్లతో ఖజానాను అప్పగించి, అప్పులన్నీ తామే చేసేశామని, పాలన ఎలా సాగిస్తారో చూస్తామంటూ 2019లో చంద్రబాబు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కుట్రపూరితంగా మాట్లాడారని గుర్తు చేశారు. అటువంటి వారు ఇప్పుడు రాష్ట్రంలో సంక్షేమ రథాన్ని పరుగులెత్తిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదలందరూ సుభిక్షంగా ఉండాలనే గొప్ప విజన్‌తో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువస్తే.. ఎవరో అందుబాటులోకి తెచ్చిన సెల్‌ఫోన్, హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్ పోర్టులను గొప్ప విజన్‌తో తానే తీసుకొచ్చానంటూ డబ్బా కొట్టుకునే నీచ మనస్తత్వం ఉన్న వ్యక్తి చంద్రబాబని మంత్రి రాజా దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనలో కరవు విలయ తాండవం చేస్తే.. జగన్ పాలనలో ఈ శతాబ్దానికే అతి పెద్ద విపత్తు కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని గుర్తు చేశారు. సీఎం జగన్ తీసుకుచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ కరోనా సమయంలో ప్రజలకు ఎంతో సేవ చేస్తే.. టీడీపీ నాయకులు ఇళ్లల్లో దాక్కుని రాజకీయాలు చేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు చేసిన అప్పులు, తప్పులను సైతం ఎంతో గొప్పగా చూపించే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లు.. సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై రోజూ శాపనార్థాలు, తిట్ల దండకాలను పతాక శీర్షికల్లో ప్రచురిస్తున్నాయని మండిపడ్డారు. తుని నియోజకవర్గాన్ని గత 40 ఏళ్లుగా తన డైరెక్షన్‌లో నడిపించిన తమ్ముడు యనమల కృష్ణుడు అన్యాయాలు, అక్రమాలు చేశాడంటూ ఇప్పుడు కొత్త వేషం వేసుకుని యనమల రామకృష్ణుడు మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారని అన్నారు. కుటిల రాజకీయాలు చేసే చంద్రబాబు, యనమల రామకృష్ణుడులను, వారికి భజన చేసే ఎల్లో మీడియాను నమ్మవద్దని మంత్రి రాజా ప్రజలకు పిలుపునిచ్చారు.

అన్నవరం దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి 14 మంది సభ్యులతో నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వారిని సభ్యులుగా నియమించారు. దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఐవీ రోహిత్ మండలి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. గత ధర్మకర్తల మండలి(2020–22)లో ఉన్నవారిలో కర్రి భామిరెడ్డి, కారుకోడి పోచమ్మను తిరిగి నియమించారు.

ధర్మకర్తల మండలి ఇదీ..

చైర్మన్: ఐవీ రోహిత్, వ్యవస్థాపక ధర్మకర్త (అన్నవరం). **సభ్యులు:** కొత్తెం పసుపులరావు (దత్తుడు – పిఠాపురం), తాడి రజని (కోరుకొండ), దోశీ వీర సూర్యనారాయణ (చిట్టిబాబు – పెద శంకర్లపూడి, ప్రత్తిపాడు), నక్కా అశ్విని (శంఖవరం), నేతల వెంకటలక్ష్మి (సామర్లకోట), కారుకోడి పోచమ్మ (అడ్డతీగల), సాపిశెట్టి భూలక్ష్మి (ఎ.కొత్తపల్లి, తుని), పేరూరి బద్రీనారాయణ (తేటగుంట, తుని), కేవీ నాగేశ్వరరావు (రాజాం, శ్రీకాకుళం జిల్లా), బొడ్డాని విజయలక్ష్మి (తాడేపల్లిగూడెం), నున్న నరసింహరావు (కాకినాడ), కడియాల లక్ష్మణరావు (పిడింగొయ్యి), కర్రి భామిరెడ్డి (కాకినాడ), రాయుడు సూర్యావతి (నరసింగపురం, పిఠాపురం). వీరితో పాటు సత్యదేవుని అలయ ప్రధానార్చకుడిని ఎక్స్ అఫీషియో సభ్యునిగా నియమించారు. వీరితో త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయిస్తామని ఈఓ సత్యనారాయణమూర్తి తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

కాకినాడ క్రైం: జీజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ కొండేపూడి శేఖర్ అవినీతి వ్యవహారంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశాల మేరకు, కలెక్టర్ కృతిక శుక్లా విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి చైర్మన్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, సీఎస్ ఆర్ఎంఓ పుష్కరరావు, ఏఓ శ్రీనివాస్‌సింగ్ సభ్యులుగా ఉన్న కమిటీ మంగళవారం విచారణ ప్రారంభించింది. శేఖర్ ఏకబిగిన 15 ఏళ్ల పాటు గుమస్తాగా వ్యవహరించిన నర్సింగ్, హౌస్ సర్జన్ సీట్ల నిర్వహణలో చోటు చేసుకున్న అవినీతిపై ఈ కమిటీ తొలుత లోతైన విచారణ చేపట్టనుంది. అనంతరం, పత్రికల కథనాలు, లేఖల రూపంలో అందిన ఫిర్యాదుల ఆధారంగా ఫిర్యాదీలను ఈ నెల 16న విచారణకు హాజరై, తమ వద్ద ఉన్న సాక్ష్యాలు సమర్పించాల్సిందిగా కోరనున్నారు. నర్సింగ్ స్కూళ్ల నుంచి లంచాలు తీసుకొని, జీఎస్ఎం విద్యార్థులను కాపీయింగ్‌కు అనుమతించారన్న ఆరోపణలపై శేఖర్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ఇప్పటికే ఆ సీటు నుంచి తొలగించారు. అంతర్గత చర్యల అనంతరం రాష్ట్ర శాఖ నుంచి నేరుగా విచారణకు ఆదేశాలు రావడం, ఆ దిశగా కలెక్టర్ తక్షణ విచారణకు ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గుడ్డుపై కమింగ్ పిడుగు

- కోళ్ల రైతుల ఆశలు ఆవిరి
- పతనమవుతున్న ధర
- పౌల్ట్రీని సంక్షోభంలోకి నెట్టేస్తున్న కమింగ్ రేటు
- రెండు వారాల్లో రైతు ధర రూ.1.25 పతనం

దారుణంగా దోచేస్తున్నారు



కోళ్ల రైతుల కష్టాన్ని కమింగ్ రేటు పేరిట దళారులు దారుణంగా దోచేస్తున్నారు. దళారులు కుమ్మక్కై, ఒక్కసారిగా ధరను తగ్గించేశారు. ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో కోళ్ల రైతులు ఉన్నారు. పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, అర్తమూరు



పౌల్ట్రీ

మండపేట: సీజన్‌లో పాత నష్టాలు గట్టెక్కిస్తుందనుకున్న గుడ్డు రైతు ధర అంతలోనే ఆవిరైంది. రెండు వారాల వ్యవధిలో రూ.1.25 పతనమై కోళ్ల రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. మరోపక్క మేత ధరలు పెరిగిపోతుండగా రానున్న వేసవితో పరిశ్రమకు గడ్డుకాలం తప్పదని పౌల్ట్రీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కమింగ్ పేరిట దళారుల దోపిడీ రైతు ధర పతనానికి కారణమని వారంటున్నారు.

ఊహించని విధంగా తగ్గిన ధర

శీతల ప్రభావం, విదేశాలకు గుడ్ల ఎగుమతులు నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పశ్చిమబెంగాల్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు పెరిగి గత నెలలో రైతు ధర పుంజుకుంటూ వచ్చింది. జనవరి 19న రూ.5.67కు చేరి పౌల్ట్రీ చరిత్రలో అత్యధిక రైతు ధరను నమోదు చేసుకుంది. ఎగుమతులకు డిమాండ్ ఉండటంతో మరికొంతకాలం పాటు రైతు ధర తగ్గకుండా నిలకడగా ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు భావించాయి. మేత ధరలు, తెగుళ్ల బెడద, నిర్వహణ వ్యయంతో గుడ్డు ధర గిట్టుబాటవ్వక గత కొన్నేళ్లుగా పరిశ్రమను వెంటాడుతున్న పాత నష్టాలు ప్రస్తుత ధరతో కొంత మేర భర్తీ అవుతాయని ఆశించారు. ఊహించని విధంగా ధర తగ్గుముఖం పట్టి రెండు వారాల వ్యవధిలోనే రూ.1.25 పతనమై ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు చేరుకుంది.

కమింగ్ రేటు పేరిట దళారుల దోపిడీ

రైతు ధర ఆశాజనకంగా ఉన్న తరుణంలో తణుకు, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని కొందరు దళారులు కుమ్మక్కై కమింగ్ రేటు పేరిట దోపిడీకి తెరలేపారని పౌల్ట్రీవర్గాలంటున్నాయి. ఎగుమతుల డిమాండ్‌ను బట్టి ఒక రోజుకు లేదా రెండు మూడు రోజులకు, ఒక్కోసారి వారం పది రోజులకు నెక్ రేటు మారుతుంటుంది. సాధారణంగా ఏ రోజు గుడ్లు ఎగుమతి చేస్తే ఆ రోజు ఉన్న ధరను వ్యాపారులు కోళ్ల రైతుకి చెల్లించాలి. అయితే గుడ్ల మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకున్న వ్యాపారులు సిండికేటై ఎగుమతులకు డిమాండ్ లేదని, కమింగ్ రేటు (ప్రస్తుతం ఉన్న ధర కాకుండా తర్వాత వచ్చే నెక్ ధరకు గుడ్లు కొనుగోలు చేస్తారు. నెక్ రేటు తగ్గితే ఎన్నిరోజులు అయితే అన్ని రోజులకు తగ్గిన ధరను చెల్లిస్తారు) సంప్రదాయానికి తెర లేపారంటున్నారు. ఈ క్రమంలోనే గత నెలలో ఆశాజనకంగా ఉన్న ధర ఒక్కసారిగా పతనమైందని కోళ్ల రైతులు అంటున్నారు. ధర మరింత తగ్గిపోతుందన్న ఆందోళనలో కోళ్ల రైతులు కమింగ్ రేటుకు తలొగ్గుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని దళారులు లాభాలకు అమ్ముకుని కోళ్ల రైతులకు తగ్గిన రేటును చెల్లిస్తున్నారు. కమింగ్ రేటు పేరిట దళారుల దోపిడీని అరికట్టేందుకు ఏపీ పౌల్ట్రీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కర్రి వెంకట ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, అసోసియేషన్ నాయకులు చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం మూడు జిల్లాల కోళ్ల రైతులు సమావేశమై సమస్యపై చర్చించారు. దళారుల దోపిడీని నిరసిస్తూ దేవరపల్లి హైవే జంక్షన్ వద్ద పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వ్యయప్రయాసలకోర్చి పౌల్ట్రీలు నిర్వహిస్తుంటే కమింగ్ పేరిట తమ కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారని వారు మండిపడుతున్నారు.

ముందున్న వేసవితో మరిన్ని కష్టాలు

ఇప్పటికే గుడ్డు ధర పతనం, మేత ధరలు దిగిరాక దిక్కుతోచని స్థితిలో ఉన్న కోళ్ల రైతులకు ముందున్న వేసవి మరింత గుబులు పుట్టిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్ది గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు కోళ్ల మరణాలు పెరిగి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టాలు వాటిల్లుతుంటాయి. పెరిగిన మేతలు, మందుల ధరలు, నిర్వహణ భారంతో గుడ్డు రైతు ధర ఐదు రూపాయలు ఉంటేనేగాని గిట్టుబాటు కాదని కోళ్ల రైతులు అంటున్నారు. ప్రస్తుతం రైతు ధర రూ.4.42కు పతనం కాగా ఆ మేరకు పరిశ్రమకు నష్టం వాటిల్లుతోంది. త్వరలో వేసవి మొదలుకానుండటంతో ధర మరింత పతనం కానుండగా, కోళ్ల మరణాలతో మున్ముందు గడ్డుకాలం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

15 వరకు నవోదయ ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు



రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల గడువును మరోసారి పొడిగించారు. ఆరవ తరగతిలో ప్రవేశానికి తొలుత తుది గడువుగా జనవరి 31గా నిర్ణయించారు. ఈ గడువును ఫిబ్రవరి 8వ తేదీ వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,442, దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సమాచారం. గతేడాది కోనసీమ జిల్లావ్యాప్తంగా 4,882 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య 50 శాతంగా ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో తల్లిదండ్రుల నుంచి గడువు పెంచాలని వినతులు రావడంతో జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

దరఖాస్తుల అప్‌లోడ్‌కు సూచనలివే..

- పూర్తి చేసిన దరఖాస్తు, విద్యార్థి ఫొటో, విద్యార్థి సంతకం, తండ్రి సంతకం కావల్సిన కేబీలోకి స్కాన్ చేసుకుని సిద్ధం చేసుకోవాలి.
- కావలసిన సైజులో మార్పు చేసుకోవడానికి ముందుగా గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇమేజ్ కంప్రెస్సర్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని, ఓపెన్ చేసుకోవాలి. అందులో + బటన్ క్లిక్ చేయగానే కంప్రెస్ టు ఎంబీ అండ్ కేబీ అని వస్తుంది. అక్కడ మీరు కావాల్సిన ఫొటో లేదా సంతకం ఎంపిక చేసుకుని కావల్సిన సైజ్ టైపు చేయాలి. కన్వర్ట్ చేసుకుని ఉంచుకోవాలి.
- అనంతరం హెచ్‌టీటీపీఎస్:సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీవోవీ.ఇన్/ఎన్‌వీఎస్ లింకు లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ ఓపెన్ చేసి డేటా అంతా ఫాస్ట్‌గా నింపాక ముందుగా సేవ్ చేసుకున్న ఇమేజెస్‌ను అన్నీ అప్‌లోడ్ చేయాలి.
- ఆధార్ నంబరుతో సమస్య ఉన్నవారు విద్యార్థి ఆధార్ దగ్గర నో అని పెట్టి తండ్రి నివాస ధ్రువపత్రం/ ఆధార్ కార్డు/ రేషన్ కార్డు/బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీగాని అప్‌లోడ్ చేసి, తర్వాత పేజీకి వెళ్లవచ్చు.
- దరఖాస్తు అప్‌లోడ్ చేసేటప్పుడు నిర్ణీత సమయంలో త్వరగా చేయాలి. లేకుంటే తిరిగి హోమ్ పేజీకి వచ్చే అవకాశముంది.

ధనాధన్ విన్నర్స్ ఐడియల్, శ్రీప్రకాష్

- అట్టహాసంగా ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు
- రన్నర్స్‌గా జీబీఆర్, గైట్ పాలిటెక్నిక్



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు కెప్టెన్‌కు షీల్డు అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



జూనియర్స్ విభాగంలో విజేత పెద్దాపురం శ్రీప్రకాష్ జట్టు కెప్టెన్‌కు ట్రోఫీ అందజేస్తున్న స్పాన్సరర్ హరీష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటముల కన్నా క్రీడాస్ఫూర్తి ప్రధానం అని, అది అలవర్చుకుని నిజ జీవితంలో కూడా రాణించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఎనిమిది రోజులుగా కాకినాడ, రాజమహేంద్రవరంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ ధనాధన్ క్రికెట్ పోటీల ముగింపు ఉత్సవం స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు షీల్డ్స్ అందజేశారు. గౌరవ అతిథులుగా టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్, జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ హాజరయ్యారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీలలో రాజమహేంద్రవరం, కాకినాడలో మ్యాచ్‌లు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 40 జట్లు పాల్గొన్నాయి. వరుసగా నాలుగో ఏడాది ఈ పోటీలను 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలలోని సీనియర్స్, జూనియర్స్ విభాగంలో విజేత జట్లు విశాఖలో జరిగే అంతర్ జిల్లాల సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో పాల్గొంటాయి.

స్పోర్టివ్‌గా ముందుకు వెళ్లాలి : ఎస్పీ

ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వాహకులు, స్పాన్సరర్స్, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. టీం స్పిరిట్‌తో పాటు 11 మంది సహకారంతో ఆడితేనే గెలుపు వస్తుందన్నారు. ఇది నిజ జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్న విషయాలకే డిప్రెషన్‌కు గురికాకుండా ప్రతీది స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభగల క్రీడాకారులకు ప్రస్తుత రోజుల్లో అవకాశాలకు కొదవ లేదన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఇటువంటి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్యఅతిథి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సీనియర్స్ విజేత కాకినాడ ఐడియల్ కళాశాల జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన అనపర్తి జీబీఆర్ కళాశాల జట్టు కెప్టెన్‌లకు షీల్డ్‌లను, సర్టిఫికెట్లను అందజేశారు. జూనియర్స్ విజేత పెద్దాపురం శ్రీప్రకాష్ స్కూల్స్‌కు టోర్నమెంట్ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్ హరీష్, రన్నర్స్‌గా నిలిచిన గైట్ పాలిటెక్నిక్ జట్టుకు జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ షీల్డ్స్‌ను ఇచ్చారు. ఆర్ఎంసీ పీడీ స్పర్జన్‌రాజు పర్యవేక్షణలో క్రికెట్ లీగ్ పోటీలు విజయవంతంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, సాక్షి సీనియర్ యాడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, క్రికెట్ కోచ్ చార్లి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు

సీనియర్స్ విభాగంలో నిర్వహించిన ఫైనల్స్‌లో ఐడియల్ (కాకినాడ), జీబీఆర్ (అనపర్తి) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జీబీఆర్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన ఐడియల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 79 పరుగులు చేసింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ సూర్యచైతన్య 35, రవికిరణ్ 22 పరుగులు సాధించారు. జీబీఆర్ జట్టులోని బౌలరు శివ 3 వికెట్లు పడగొట్టాడు. 80 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జీబీఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 75 పరుగులు చేసింది. 5 పరుగుల తేడాతో ఐడియల్ జట్టు విజయం సాధించి సీనియర్స్ విభాగంలో కప్ అందుకుంది. రన్నర్స్‌గా జీబీఆర్ జట్టు నిలిచింది.

జూనియర్స్ విభాగంలో నిర్వహించిన మ్యాచ్‌లో శ్రీప్రకాష్ (పెద్దాపురం), గైట్ (రాజమహేంద్రవరం) పాలిటెక్నిక్ జట్లు పోటీ పడ్డాయి. గైట్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ తీసుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన శ్రీప్రకాష్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 135 పరుగులు చేసింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ యశస్వి 32, దిలీప్ 25, చరణ్ 28, హార్దిక్ 22 పరుగులు చేశారు. గైట్ జట్టులోని బౌలర్ మురళి 2 వికెట్లు తీసుకున్నాడు. 136 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన గైట్ జట్టు నిర్ణీత ఓవర్లలో 83 పరుగులు మాత్రమే చేసి 4 వికెట్లు కోల్పోయింది. 52 పరుగుల తేడాతో శ్రీప్రకాష్ జట్టు విజయం సాధించి జూనియర్స్ విభాగంలో కప్‌ను సొంతం చేసుకుంది. రన్నర్స్‌గా గైట్ పాలిటెక్నిక్ జట్టు నిలిచింది.



సీనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన అనపర్తి జీబీఆర్ జట్టు కెప్టెన్‌కు షీల్డ్ అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



జూనియర్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన గైట్ కళాశాల జట్టు కెప్టెన్‌కు ట్రోఫీ అందజేస్తున్న క్రికెట్ సంఘం కార్యదర్శి సత్యనారాయణ

వైభవంగా భీమేశ్వరుని శ్రీ పుష్పోత్సవం



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలో కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లకు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. పుణ్య దంపతులకు తాంబూలాలు అందజేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు కార్యక్రమంలో పాల్గొని మొదటి దంపత తాంబూలం అందుకున్నారు. మండల ఉపాధ్యక్షురాలు నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నున్న సత్యవతి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మాణిక్యాంబా అమ్మవారి, భీమేశ్వరస్వామివారికి చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.



పుష్పోత్సవం సందర్భంగా తాంబూలం అందుకుంటున్న మంత్రి వేణు దంపతులు

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

ఆలస్యంగా కేసు నమోదు చేసిన పోలీసులు

సామర్లకోట: మానసిక దివ్యాంగురాలిపై జాలి పడవలసి ఉండగా అటువంటి బాలికపై లైంగికదాడి చేసిన ఘటన వేట్లపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అభం శుభం తెలియని ఆమెపై అదే గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అప్పన్న అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భవతిగా ఉన్న దివ్యాంగ కుమార్తెలో వస్తున్న మార్పులను గమనించిన ఆమె తల్లి జరిగిన విషయం తెలుసుకొంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కుమార్తెకు మాయమాటలు చెప్పి మోసం చేశాడని తల్లి పందురి అనంతలక్ష్మి రోదిస్తోంది. ఈ విషయంపై 10 రోజుల క్రితం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు చర్యలు తీసుకొనకపోవడంతో మంగళవారం తన కుమార్తెతో పోలీసు స్టేషన్‌కు వచ్చింది. దాంతో పోలీసుల్లో కదలిక వచ్చి కేసు నమోదు చేయడానికి హామీ ఇచ్చారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. తల్లి పందురి అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై టి.సునీత దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత బాలిక తల్లిపై దాడి

కాకినాడ క్రైం: అత్యాచార యత్నానికి గురైన ఘటనలో బాధిత మైనర్ బాలిక తల్లి కోర్టును ఆశ్రయించిందనే అక్కసుతో నిందితుడు సహా అతడి తండ్రి బాలిక తల్లిని చితకబాదారు. ఈ ఘటన కాకినాడలోని ఇంద్రపాలెంలో జరిగింది. బాధితురాలి వాంగ్మూలం మేరకు, నరాల శివ రామకృష్ణ కుమారుడు 20 ఏళ్ల నరాల గౌతమ్ బంధువుల బాలిక అయిన ఓ మైనర్‌పై 2021లో అత్యాచారానికి యత్నించాడు. ఈ ఘటనలో బాలిక తీవ్ర గాయాలపాలు కాగా తల్లి గాలి అనుపమ ఫిర్యాదుతో కాకినాడ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. సదరు కేసు విచారణ దశకు చేరుకోగా ఈ నెల 9వ తేదీన గౌతమ్ కోర్టుకు హాజరుకావలసి ఉంది. ఈ నేపథ్యంలో ఉక్రోశం వెళ్లగక్కిన నిందితుడు గౌతమ్ తండ్రి శివ రామకృష్ణ కేసు వాపసు తీసుకోవాలంటూ బాధిత బాలిక తల్లి అనుపమని మంగళవారం విచక్షణారహితంగా కొట్టాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన అనుపమను స్థానికులు బాధితురాలి బంధువులతో కలిసి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఇదే రీతిలో శివ కేసు నమోదు చేయించిన సమయంలోనూ దాడి చేశాడని ఆ ఘటనపై కాకినాడ త్రీ టౌన్ పీఎస్‌లో కేసు నమోదు అయిందని బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొంది.

సత్తా చాటిన ఆదిత్య



ఎంఎస్ఎస్ కార్తీక్ ప్రణవ్ | ఆర్.అశోక్‌చంద్ర | కె.తేజశ్విని

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ-మెయిన్స్-2023 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మంగళవారం తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు 32 మంది 99.00 పర్సంటైల్‌కు పైన సాధించి ఘనత చాటారన్నారు. ఎంఎస్ఎస్ కార్తీక్ ప్రణవ్ 99.94, ఆర్.అశోక్‌చంద్ర 99.94, కె.తేజశ్విని 99.88, వీఆర్.శివతేజ 99.88, బి.భవిత 99.87, కె.వినయ్ 99.85, ఎల్.లిఖిత 99.83, పి.కార్తికేయ 99.83 పర్సంటైల్ సాధించారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, కో-ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్ అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ ప్రతిభ



ఎన్.సూర్యచరణ్ | ఎస్.అశోక్ | జి.శిరీషా

తుని: జేఈఈ మెయిన్స్‌లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి మంగళవారం తెలిపారు. శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్.సూర్యచరణ్ 99.69, ఎస్.అశోక్ 96.79, జి.శిరీషా 96.79 పర్సంటైల్ సాధించారన్నారు. కళాశాలలో మెయిన్స్‌కు కోసం ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ద్వారా విజయం సాధించి 10 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

ఆరుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులు



ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ మరణించిన ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇస్తూ ఉత్తర్వులను మంగళవారం జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ అందజేశారు. ఆరుగురికి అందుబాటులో ఉన్న వివిధ కార్యాలయాల్లోని ఖాళీల్లో సబార్డినేట్ పోస్టులను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు సీఈవో సత్యనారాయణ తెలిపారు. సీహెచ్ రవిశంకర్ (ఎంపీపీ, తుని), టి.మానస (ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్, కాకినాడ), జి. రత్నమాలతీ (ఎంపీపీ ఉప్పలగుప్తం) జి.గోవిందరాజు (ఎంపీపీ కాజులూరు), జి.జయసత్యశ్రీ (పీఐయూ డివిజన్, కాకినాడ), సీహెచ్ అనిత (ఎంపీపీ, రాజవొమ్మంగి)ను సబార్డినేట్ పోస్టుల్లో నియమించినట్లు వివరించారు. ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి ఎ.రమణారెడ్డి, ఏపీ పంచాయతీ రాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌వివి రమేష్ పాల్గొన్నారు.